# తెప్ప - మనిషి

-మాగంటి వెంకట సుబ్రహ్మణ్యం

"సార్, టెలిగ్రాం" అన్న టెలిగ్రాఫ్ మెసెంజర్ పిలుపు విని, పడక్కుర్చీలో పడుకొని పేపరు చదువుతోన్న జానకిరామయ్య ఒక్కసారి తలెత్తి చూసి గతుక్కుమన్నాడు.

అవును మరి! టెలిగ్రాం వచ్చిందంటే ఎవరికైనా భయంగానే ఉంటుంది.

అందులోని విషయం ఒక్కోసారి సంతోషాన్ని కలిగించేదయినా, విషయం తెలిసేవరకూ గుండెదడదడా కొట్టుకుంటూనే ఉంటుంది. అలాంటిది దుఃఖాన్ని కలిగించేదయితే ఇంకవేరే చెప్పనక్కరలేదు.

జానకిరామయ్య పేపరు మడిచి, పక్కనపెట్టి, మెల్లిగా కుర్చీలో నుండి లేచి, తడబడుతూ వాకిటివైపు నడిచాడు. కాగితంపై సంతకంచేసి టెలిగ్రాం తీసుకొన్నాడు.

అది చదివేటప్పటికి కళ్ళు బైర్లుకమ్మి, ముచ్చెమటలు పోసి తూలి క్రింద పడబోయి, అక్కడే గోడకి చారగిలపడ్డాడు.

ఇంతలో ఇంట్లోనుండి వరలక్ష్మమ్మ బయట కొచ్చింది... 'టెలిగ్రాం' అని మెంసెంజర్‌కేక విన్నందువల్ల, భర్త కళ్ళు మూసుకుని గోడకి చారగిలపడి ఉండటం చూసి, కంగారు పడిపోయి, మెల్లిగా ఆయన్ను పట్టుకొని, తీసికొచ్చి కుర్చీలో కూర్చోబెట్టింది.

ముఖాన కాసిని చన్నీళ్ళు చిలకరించి, కొంచెంసేపు విసనకర్రతో విసిరిన తరువాత జానకిరామయ్య మెల్లిగా కళ్ళు తెరిచాడు.

"ఏమయిందండీ. టెలిగ్రాం ఎక్కడ నుండి?" అని వరలక్ష్మమ్మ కంగారు పడుతూ భర్త నడిగింది.

"నెల్లూరు నుండి భూదేవి ఇచ్చిందే. భర్తగుండె జబ్బుతో చనిపోయాట్ట. వెంటనే బయలుదేరి రమ్మని ఇచ్చింది." అన్నాడు జానకిరామయ్య దుఃఖాన్ని దిగమ్రింగుతూ.

"అయ్యో! మొన్ననేకదండీ. కొడుకు పుట్టిన రోజు పండుగ చేశాము. అంతా కులాసా అని వ్రాశారు ఇంతలోనే ఇంతముంచుకొచ్చిందా." అన్నది వరలక్ష్మమ్మ ఆశ్చర్యపోతూ.

"గుండెజబ్బులు అంతే వరలక్ష్మీ. ఎప్పుడేది ముంచుకొస్తుందో చెప్పలేం, కాలం తీరిపోయింతర్వాత ఎవరూ ఇక్కడ ఉండటానికి వీలులేదు కదా!" అన్నాడు జానకిరామయ్య వేదాంతధోరణిలో.

"ఆ ఒక్క కొడుకూ కాస్త పైకొచ్చే వరకూ బ్రతికితే బాగుండేది. వాడేమో పసివాడు. ఆస్తి పాస్తులా లేవు. ఆ జీవితాలు ఎలా వెళ్ళమారుతాయో. ఏమో" అంది వరలక్ష్మమ్మ వాళ్ళమీద సానుభూతి కనబరుస్తూ.

"ఈ పరిస్థితిలో వాళ్ళు ఎక్కడికి పోతారు. మనింటికే తీసి కొద్దాం. కలోగంజో తాగుతూ మనతోపాటే ఉంటారు. మన అమ్మాయి వాళ్ళ కోడలే అనుకున్నాం కదా! వాడికి కూడా చదువు సంధ్యలు చెప్పించి ఇల్లరికం ఉంచుకుంటే సరిపోతుంది. అంతకంటే మనం మాత్రం చేయగలిగినదేముంది. భగవంతుడి లీల ఎట్లా ఉందో అట్లా జరుగు



తుంది." అంటూ జానకిరామయ్య కుర్చీలో నుండి లేచాడు.

మళ్ళీ తనే "వరలక్ష్మీ, బట్టలూ అవీ సర్దు. ఇప్పుడు నాలుగుగంటలకు బండిఉంది. ఆ బండిలో వెళదాం." అంటూ వంకీకున్న చొక్కాతీసుకొన్నాడు తొడుక్కోటానికి. వరలక్ష్మమ్మ తనకూ, భర్తకూ, కూతురికీ పెట్టెలో బట్టలు సర్దటం మొదలుపెట్టింది.

బట్టలు సర్ది, బయట ఆడుకొంటూన్న కూతుర్ని పిలిచి, ఇంటికి తాళంవేసి స్టేషనుకు బయలుదేరారు.

భూదేవి జానకి రామయ్యకు ఒక్కగానొక్క చెల్లెలు. చిన్నతనంలోనే తల్లీ తండ్రీ చనిపోతే చెల్లెల్ని తనే పోషించి. పెద్దదాన్ని చేసి పెళ్ళిచేశాడు. చెల్లెలి భర్త ఆనందరావు పెద్ద ఆస్తిపరుడు కాకపోయినా, చదువుకున్నవాడూ, మంచి వాడూ కావటాన చెల్లెల్ని అతనికిచ్చి పెళ్ళి జరిపించాడు.

దానికి తగ్గట్టు ఆనందరావు కూడ కొద్దో గొప్పో సంపాదిస్తూ భార్యని బాగానే చూసుకుంటున్నాడు.

చెల్లెలి పెళ్ళి కాకుండా తను పెళ్ళిచేసుకోనని భీష్మించటంవల్ల జానికి రామయ్య అప్పటిదాకా పెళ్ళి చేసికోలేదు. తరువాత భూదేవి పట్టుబట్టి అన్నగారి పెళ్ళి కూడా జరిపించింది.

భూదేవికి కొడుకు పుట్టి పధ్ధేవాడయ్యాడు. వాడికి చంద్రం అని పేరుపెట్టారు. తరువాత రెండేళ్ళకు లక్ష్మమ్మకి లక్ష్మి పుట్టింది. రామూకి పెళ్ళాం పుట్టింది అనుకున్నారు.

పరిస్థితులన్నీ ఈ విధంగా అనుకున్నది అనుకున్నట్లుగా జరిగిపోతూ ఉండటంవల్ల, జానకిరామయ్య ఏ దిగులూ చింతాలేకుండా జీవితం గడిపేస్తున్నాడు. ఇంతలో అనుకోని విధంగా ఆనందరావు మరణం జానకిరామయ్యను మానసికంగా కృంగదీసింది.

జానకిరామయ్య నెల్లూరులో చెల్లిలి ఇంటికి చేరుకొనే సరికి రామూ ఎదురు వచ్చి ఒక్కసారిగా బావురు మన్నాడు.

చెల్లెలి భూదేవి పరిస్థితి సరేసరి, కంటికి మంటికి ఏకధారగా ఏడుస్తోంది. జానకిరామయ్య వాళ్ళిద్దరినీ ఎన్నో విధాలుగా ఓదార్చాడు.

వరలక్ష్మమ్మ భూదేవిదగ్గరే కూర్చుని ఓదార్చటం మొదలు పెట్టింది. జానకి రామయ్య రామూని అవతలకు తీసికొనిపోయి ధైర్యం చెప్పాడు.

ఆ పన్నెండు రోజులు జానకిరామయ్యే అన్ని పనులూ నెత్తిన వేసికొని జరిపించాడు. పన్నెండోరోజు సాయంకాలానికి వచ్చిన వాళ్ళందరూ ఎక్కడివాళ్ళు అక్కడ కెళ్ళిపోయారు. తరువాత జానకిరామయ్య భూదేవితో అన్నాడు.

"నువ్వూ, రామూ వచ్చి మా ఇంట్లోనే ఉండండి. నీకు మాత్రం ఇక్కడ ఎవరున్నారని. రామూ కూడా లక్ష్మితోపాటే చదువుకుంటాడు. వాడికి రెక్కలొచ్చేదాకా సాకితే తరువాత వాడే అన్నీ చక్కదిద్దుకుంటాడు."

"ఎందుకులే అన్నయ్యా. ఇక్కడే నేను ఏదో పనిచేసి వాణ్ణే చదివిస్తాను. మళ్ళీ నీకు భార మెందుకు?" అంది భూదేవి. అన్నయ్య తన వాడైనా వదిన పరాయిదేగా అన్న ఉద్దేశ్యంతో.

"అదేమిటి చెల్లమ్మా. మీరు నాకు భారమా? అయినా నువ్వు ఒక్కదానివే ఇక్కడ ఎట్లాఉంటావు. అటువంటి పిచ్చి పిచ్చి ఆలోచనలు పెట్టుకోకుండా పిల్లవాడితో బయలుదేరు." అన్నాడు జానకిరామయ్య ఆఖరిసారిగా చెబుతున్నట్లు.

వరలక్ష్మమ్మ కూడా భూదేవిని ఒత్తిడిచేసింది కొడుకుతో సహా బయలుదేరమని. ఇంకా చేసేది లేక భూదేవి కొడుకుతోసహా బయలుదేరింది అన్నగారింటికి.

జానకిరామయ్య రామూనికూడా బడిలో చేర్పించాడు. రామూ, లక్ష్మి కలిసే బడికి వెళతారు. వచ్చేటప్పుడు కూడా కలిసే ఇంటికి వస్తారు. ఇది వరకు ఆడుకునేందుకు ఇంట్లో ఎవరూ లేకపోవటంచేత లక్ష్మి బిక్కు బిక్కుమంటూ ఉండేది. ఇప్పుడు 'బావా' అంటూ రామూ తోనే ఉంటోంది. బావకు కావలిసినవన్నీ తనే చేస్తుంది. తనకు రాని పాఠాలు బావ దగ్గర చెప్పించుకుంటుంది. ఒక్క క్షణం కూడా బావను వదిలి పెట్టి ఉండదు. రామూ కూడా లక్ష్మిని ఆప్యాయంగా చూసుకుంటున్నాడు.

వాళ్ళ ఆటపాటలు, స్నేహం చూసి భూదేవి. జానకిరామయ్య, వరలక్ష్మమ్మ మురిసిపోతున్నారు.

రామూ, లక్ష్మిలు ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క క్లాసు పాసవుతూ వస్తున్నారు. రామూ క్లాసులో మొదటివాడుగా వస్తున్నాడు.

ఆ రోజు స్కూలు ఫైనల్ పరీక్షా ఫలితాలు తెలిశాయి. రామూ పేపరు పట్టుకొని వీధిలోంచి పరుగెత్తుకుంటూ వచ్చి "నేను పరీక్ష ఫస్టు క్లాసులో పాసయ్యాను మామయ్యా. ఇదిగో పేపరు." అంటూ చూపించాడు.

ఇంట్లో అందరూ చాలా సంతోషించారు.

"ఇంత వరకూ చెప్పించిన చదువుచాల్లే అన్నయ్యా. ఇంకవాణ్ణి ఏదైనా ఉద్యోగంలో పెట్టు." అన్నది భూదేవి అన్ననుద్దేశించి.

"నిండా పదిహేనేళ్ళు లేవు. వాడికిప్పుడే ఉద్యోగమా? ఈ రోజుల్లో స్కూలు ఫైనల్ చదివిన వాడికి ఏం ఉద్యోగాలొస్తాయి. ప్యూను ఉద్యోగానికి కూడా బి.ఏ. చదివిన వాళ్ళు వస్తున్నారు. వాడెంత వరకు చదువుకుంటాడో అంతవరకూ చదువుకోనీ చెల్లెమ్మా." అన్నాడు జానకి రామయ్య.

"కొడుకైనా అల్లుడైనా అతడేగా. చదువుకోనీ వదినా. మాను మాత్రం ఏ పదిమంది కొట్టుకుపోతున్నారు. రేపు రామూ పెద్దఉద్యోగం చేస్తే మా అమ్మాయి మాత్రం సుఖపడదూ." అంటూ వరలక్ష్మమ్మ కూడా భర్తకు వంత పలికింది.

"బావగారు బ్రతికున్నప్పుడు నాతో అంటూ ఉండేవారు. రామూని ఎట్లాగయినా గొప్ప డాక్టర్ని చెయ్యాలని. పాపం! అయనే బ్రతికుంటే తన కోర్కె నెరవేర్చుకొనేవాడు కదా! నేను రామూని డాక్టర్ని చేసి ఆయన ఆత్మకి శాంతి కలిగిస్తాను." అన్నాడు జానకిరామయ్య కించిత్ బాధపడుతూ.

భూదేవి కొంగుతో కళ్ళు వత్తుకుంది భర్త విషయం వచ్చేసరికి.

ఆ తర్వాత జానకి రామయ్య ఇల్లు తాకట్టుపెట్టి షావుకారు దగ్గర డబ్బు తెచ్చి రామూని కాలేజిలో చేర్పించాడు.

ఊళ్ళో ఉన్న చదువే కాబట్టి జానకి రామయ్య ఆ రెండేళ్ళూ పెద్దగా కష్టపడకుండానే రామూ కాలేజీ చదువుకు అయ్యే ఖర్చుకు తట్టుకోగలిగాడు.


# పరిచయం

పేరు : మాగంటి వెంకటసుబ్రహ్మణ్యం
వయస్సు : 62 సంవత్సరములు
విద్యార్హత : బి.ఏ., బి.ఇడి.
ఉద్యోగం : ఉపాధ్యాయ వృత్తి.
హాబీలు : లలిత కళలంటే అభిమానం నిజామాబాదు ఆకాశవాణిలో కొన్ని వ్యాసాలూ, కథలూ ప్రసారమయ్యాయి.
సన్మానాలు : ఉపాధ్యాయునిగా నిజామాబాదు డి.ఇ.ఓ.గారిచేత, బోధన్ లయన్స్ క్లబ్ వారిచేత, మధుమాలంచ స్కూలు మేనేజిమెంట్ వారిచేత సన్మానింపబడ్డాను.
లక్ష్యాలు : ఎప్పుడూ బిజీగా ఉండటం , చేపట్టిన వృత్తికి న్యాయంచేకూర్చటం, అందరితో మంచిగా ఉండి అందరి అభిమానాన్ని పొందటం.

మాగంటి వెంకట సుబ్రహ్మణ్యం.
హెచ్.నెం.4-1-490, శక్కర్‌నగర్ చౌరస్తా
బోధన్ - 503 185
నిజామాబాద్ - జిల్లా.

ఆ తర్వాత రామూ ఇంటర్‌మీడియట్ ఫస్టు క్లాసులో పాసవటం, యం.బి.బి.యస్‌లో సీటు రావటం జరిగిన తర్వాత జానకిరామయ్య తనేస్వయంగా రాముని హైదరాబాదు తీసుకెళ్ళి మెడికల్ కాలేజీలోనూ, హాస్టల్‌లో చేర్పించి వచ్చాడు తర్వాత నెల నెలా ఖర్చులకి, ఫీజులకి డబ్బు పంపుతూనే ఉన్నాడు.

రామూ ఎక్కడ డబ్బులేక బాధపడతాడో అని ఉత్తరం వచ్చిన వెంటనే డబ్బు పంపుతూ వచ్చాడు.

ఆ అయిదు సంవత్సరాలకాలాన్ని అయిదు నిమిషాల్లా గడిపేస్తు రాము యం.బి.బి.యస్. కూడా ఫస్టు క్లాసులో పాసయ్యాడు. రామూ యం.బి.బి.యస్ చదువుకి జానకిరామయ్య ఇల్లు, పొలం పూర్తిగా అమ్మేశాడు. ఇప్పుడు ఆ ఇంట్లోనే ఉంటున్నా అద్దె చెల్లించి ఉంటున్నాడు.

ఆస్తిపోయినందుకు జానకి రామయ్య బాధపడలేదు. ఎందుకంటే తనకు కాబోయే అల్లుణ్ణి ప్రయోజకుణ్ణి చేశాననే తృప్తి మిగిలింది. రేపొ పున్న తన అల్లుడు ప్రాక్టీసు పెట్టి ఒకటి రెండు సంవత్సరాలలోనే తన ఆస్తికి మించిన ఆస్తిని సంపాదించగలడు. ఆ ధీమాతోనే జానకిరామయ్య ఆస్తిని అమ్మేటప్పుడు సంతోషంగా అమ్మేశాడు.

చదువుపూర్తయి ఇంటికి వచ్చినరామూని జానకి రామయ్య ప్రాక్టీసు ఎప్పుడు, ఎక్కడ పెట్టబోతున్నావని అడిగాడు.

"లేదు మామయ్యా. నేను ఇప్పుడు ప్రాక్టీసు పెట్టడం లేదు. నన్ను విదేశాలకు వెళ్ళమని మా ప్రిన్సిపాల్‌గారు ప్రోత్సహించారు. నాకు స్కాలర్‌షిప్ కోసం కూడా ప్రయత్నిస్తున్నారు. ముందు కొద్దిగా పెట్టుబడిపెడితే తర్వాత స్కాలర్‌షిప్ వస్తుంది కాబట్టి చదువు దానంతటదే సాగిపోతుంది. ఏమంటావ్." అని మామయ్య వంక చూచాడు.

"అలాగే నాయనా! నువ్వు పెద్ద చదువులు చదివి వృద్ధిలోకి వస్తానంటే నేను మాత్రం కాదంటానా? మీ ప్రిన్సిపాల్‌గారితో మాట్లాడి నీ ప్రయత్నంలోనే ఉండు. డబ్బుకు నేను ఏర్పాటు చేస్తాను" అన్నాడు జానకి రామయ్య

సరేనని రామూ ప్రిన్సిపాలుగారింటికి వెళ్ళాడు. ఈ కబురు చెప్పటానికి.

భార్యను చాటుకు పిలిచి, "ఇప్పుడు రామూ చదువుకు డబ్బు సర్దుబాటు కావాలి. నీ నగలిప్పు వాటిని అమ్మి ఆ డబ్బుతో రామూని ఫారిన్ పంపిద్దాం. ఎటు తిరిగి ఆ నగలు లక్ష్మికిచ్చేవేగా. తర్వువాత వాళ్ళే చేయించుకుంటారు." అన్నాడు జానకి రామయ్య.

వరలక్ష్మమ్మ మారు మాట్లాడకుండా వాటినన్నిటిని మూటకట్టి ఇచ్చింది. జానకిరామయ్య వాటిని నగదుగా మార్చి రామూకిచ్చాడు.




జడ్జి:- అబద్ధం చెప్తే చచ్చింతర్వాత నరకానికి పోతావ్. కాబట్టి నిజం చెప్పు.

ముద్దాయి:- నిజం చెప్తే బ్రతికుండగానే జైలుకు పోతాను.

-నగరి విజయ్
ఆర్మూర్.

రామూ ఫారిన్ వెళ్ళేరోజు వచ్చింది. అందరి వద్దా శలవుతీసికొని బయలు దేరాడు.

రామూ ఫారిన్లో ఉన్నన్నాళ్ళు జానకిరామయ్యగార్కి ఏ నాలుగైదు ఉత్తరాలో రాశాడు. వాటిల్లో కూడా తను కులాసాగానే ఉన్నట్లు, బాగా చదువుకుంటున్నట్లు, ఏవో రెండు ముక్కలు తప్పమరే విషయమూ ఉండేది కాదు. చదువు ధోరణిలోపడి తీరిక లేక ఉత్తరాలు అలా రాస్తున్నాడేమో అని జానకిరామయ్య సరిపెట్టుకొనేవాడు.

ఆ రెండు సంవత్సరాలు జానకిరామయ్య సంసారాన్ని ఎలా ఈదాడో ఆ భగవంతుడికే తెలుసు.

రామూ ఇవాళోరేపో వస్తాడు, తనను ఉద్ధరిస్తాడు అని జానకిరామయ్య రోజూ ఎదురుచూస్తూనే ఉన్నాడు. రోజులూ, వారాలు, నెలలు గడిచిపోతున్నాయి. కాని రామూ జాడతెలియలేదు.

ఒకరోజున రామూ దగ్గరనుండి హటాత్తుగా ఉత్తరం వచ్చింది. గంపెడాశతో రామూ కోసం ఎదురు చూస్తున్న జానకి రామయ్యకు వెయ్యేనుగులబలం వచ్చినట్లయింది. అంతవరకు ముడుచుకుపోయిన ముఖాలతో ఉన్న భూదేవి, వరలక్ష్మమ్మ ముఖాలు సూర్యకాంతికి కమలాలు వికసించినట్లుగా అయి, దేదీప్యమానంగా ప్రకాశించటం మొదలుపెట్టాయి.

ఇంక లక్ష్మి సంగతి సరేసరి. పౌర్ణమినాటి సముద్ర తరంగమే అయింది. గంపెడాశతో జానకిరామయ్య కవరుచింపి చదవటం మొదలుపెట్టాడు.

పూజ్యులైన మామయ్యకు రామూ వ్రాయునది నేను ఇచ్చట క్షేమముగానే ఉన్నాను. నా చదువు పూర్తి అయింది. మీరు, అమ్మ, అత్తయ్య, లక్ష్మి అందరూ క్షేమమని తలుస్తాను. నేను రేపు బయలుదేరి ఇండియా వస్తున్నాను. ఇంతే సంగతులు.

ఇట్లు
రాము.

రామూ ఇంటికి వచ్చినప్పుడు ఇంట్లో అందరూ చాలా సంతోషించారు. ఇక వాళ్ళ కష్టాలన్నీ తీరిపోయాయి అని మిక్కిలి ఆనందపడ్డారు.

రామూ వచ్చేస్తాడు, ఇక డాక్టరు ప్రాక్టీసు పెట్టి రెండుచేతులా సంపాదించి, ఈ సంసారాన్ని ఉద్ధరిస్తాడు అని అందరూ భావించారు.

ఇక లక్ష్మినిచ్చి రామూకి పెళ్ళికూడా చేసేస్తే తన బాధ్యత తీరిపోతుందని జానకిరామయ్య ఒక రోజు రామూతో పెళ్ళిప్రస్తావనని తెచ్చాడు.

"రామూ! మీ నాన్న నిన్ను డాక్టరును చెయ్యాలని అనుకున్నాడు. పాపం! ఆయన తన కోరిక తీర్చుకోకుండానే వెళ్ళిపోయాడు. ఆయన కోర్కె తీర్చి ఆయన ఆత్మకి శాంతి చేకూర్చాలనే ఉద్దేశ్యంతో, నా తాహతుకు మించిందయినా నిన్ను డాక్టరును చేశాను.

నీ కోర్కె మేరకు నిన్ను ఫారిన్ కూడా పంపించాను. దానికి తగ్గట్టు నువ్వు కూడా చక్కగా చదువుకొని, నే పడిన శ్రమకు ఫలితం దక్కించావ్. నీవు ఇప్పుడు గొప్ప డాక్టరివి.

నీకు పెళ్ళికూడా చేసేస్తే, నా బాధ్యత తీరి పోయినట్లే. మొదటినుండీ లక్ష్మిని నీకివ్వాలనే ఉద్దేశ్యం తోనే ఉన్నాను. ఏమంటావ్. ముహుర్తాలు పెట్టించ మంటావా?" అన్నాడు జానకిరామయ్య రామూ ముఖంలోకి చూస్తూ.

"క్షమించు మామయ్యా. నేను ఫారిన్‌లో ఉండగా శిల్ప అనే అమ్మాయితో నాకు పరిచయం అయింది. మేమిద్దరం ప్రేమించుకున్నాం. పెళ్ళి కూడా చేసుకున్నాం. ఆమె మొన్న నాతోపాటు ఇండియా వచ్చింది. ఆమె తల్లిదండ్రులు హైదరాబాదులో ఉంటారు. అందుకే ఆమె అక్కడకు వెళ్ళింది.

కొద్ది రోజుల్లో మేము హైదరాబాదులో ప్రాక్టీసు పెట్టాలని అనుకొన్నాం. వాళ్ళు చాలా సంపన్నులు అవటంచేత మేము పెట్టబోయే హాస్పటల్‌కు పెట్టుబడి ఆమే సమకూరుస్తోంది. దానికి నేను మీకు చాలా కృతజ్ఞుణ్ణి.

ఇక లక్ష్మి సంగతంటారా? ఆమెకెక్కడయినా మంచి సంబంధం చూడు మామయ్యా. ఆమె పెళ్ళి ఘనంగా నేను చేస్తాను. ఈ విషయంలో నువ్వు నిశ్చింతగా ఉండు మామయ్యా." అన్నాడు రామూ విలాసంగా అదోలెక్కా అన్నట్లుగా.

వరలక్ష్మమ్మ, భూదేవి అవాక్కయిపోయారు! లక్ష్మి కళ్ళకి రామూ తెప్పని-తగలెడ్తోన్న మనిషిలా కన్పించాడు.

ఎమ్.వి. సుబ్రహ్మణ్యం
హెచ్.నం. 4-1-490, శక్కర్‌నగర్ చౌరస్తా,
బోధన్ - 503 185.
నిజామాబాద్ జిల్లా.

★